నముడూరి భాస్కరరాముం

# వ్యవస్థ

పి.జి. హాస్టలు రూంలో కూచుని సాయంత్రం బజారుకెళ్ళి తను ఏం కొనితెచ్చుకోవాలో లిస్టు రాసుకుంటు న్నాడు దీక్షితులు. పోస్టుగ్రాడ్యుయేషన్ మొదటి సంవత్సరంలో చేరి, ఆరోజే హాస్టలు రూంలోకి వచ్చి చేరాడు. డిగ్రీలో కూడా హాస్టలులో ఉండి చదివా డతను. అందుచేత హాస్టలు వాతావరణ మేమీ కొత్తగా లేదతనికి.




అప్పటికి ఒకరిద్దరు మాత్రమే విద్యార్థులు వచ్చి చేరడంవల్ల హాస్టలు రూములు ఇంకా చాలా ఖాళీగా ఉన్నాయి. రూంలో తనకి కావాల్సిన కొబ్బరినూనె, సబ్బులు వగైరా లిస్టు పూర్తిచేసు కొని, బజారుకు వెళ్ళడానికి, లేచి డ్రస్ చేసుకో సాగాడతను. అంతలో అతనికి ఎక్కడినుంచో సన్నటి మూలుగు వినిపించసాగింది. చిన్న చిన్న విషయాలకి స్పందించే సున్నిత మనస్తత్వమత నిది. చటుక్కున తిరుగుతున్న ఫ్యాన్ 'ఆఫ్' చేసి చెవులు రిక్కించి విని, ఆ మూలుగు పక్క గది లోంచి వస్తున్నదని గ్రహించాడతను. గబగబా పక్క రూంవైపు నడిచాడు.

ఆ రూంలో వ్యక్తి కూడా తనలాగే కొద్ది గంటల క్రితమే వచ్చి ఉంటాడని, ఇంకా విప్పని అతని లగేజీని బట్టి తెలిసిందతనికి. రూం తలుపు కూడా వేసుకోకుండా ఎలా వచ్చిన మనిషి అలాగే జ్వరంతో పడిపోయాడని గ్రహించాడు.

'ఏమండీ' పిలిచాడు దీక్షితులు. కానీ అతని నుంచి మూలుగు తప్ప ఏ జవాబూ రాలేదు. అతని ఒంటిమీద చెయ్యివేసి గబుక్కున వెనక్కి తీసుకున్నాడు దీక్షితులు. బాగా కాలిన పెనం లాగా ఉంది అతని ఒళ్ళు. తక్షణ కర్తవ్యం ఆలో చించి, కాలేజీ 'డిస్పెన్సరీ' వైపు పరుగుతీశాడు.

డిస్పెన్సరీ డాక్టరుతో మాట్లాడి, ఏవో క్యాప్సూల్స్ తెచ్చి అతని చేత మింగించి, పక్కనే కూచున్నాడు దీక్షితులు. ఓ అరగంట గడిచే సరికి జ్వరం తీవ్రత కాస్త తగ్గి కళ్ళు తెరిచాడా వ్యక్తి.

"మీరు?" సన్నటి గొంతుతో ప్రశ్నించాడతను.

"నా పేరు దీక్షితులు. నేను పక్క రూంలో ఈరోజే చేరాను.. కాస్త కాఫీ తాగండి" అంటూ ఫ్లాస్కు లోంచి వంచి కాఫీ ఇచ్చాడు. ఆ వ్యక్తి కృతజ్ఞతగా దీక్షితులు వంకచూసి కాఫీ కప్పు తీసుకు తాగి, కప్పు పక్కన పెట్టాడు. ఆ కప్పు కడిగి తీసుకురావ టానికి ఉద్యుక్తుడైన దీక్షితుల్ని, "తరువాత అది నేను కడుక్కుంటాను. దయచేసి అది అలా ఉండనివ్వండి" అని వారించాడా వ్యక్తి.

"నో!నో! ఎంగిలి కప్పు అలా ఉంచుకోవడం ఆరోగ్యానికి మంచిది కాదు. ఎంత సేపు, ఒక్క నిముషం అని ఆ కప్పు తీసుకుని వాష్‌బేసిన్ దగ్గర అది కడిగేసి తెచ్చాడు దీక్షితులు.

"మీకు శ్రమ ఇచ్చాను. ఇంటి దగ్గర జ్వరం తోనే బయలుదేరాను. ఏవో క్యాప్సూల్స్ వేసు

కున్నాను. కానీ తగ్గలేదు. ఎలాగో కష్టపడి రూం చేరుకన్నాను. తరువాత మళ్ళీ ఇప్పుడే తెలివొచ్చింది. మీకు థ్యాంక్స్ ఎలాట్!"

"నో!నో! హాస్టల్లో మనం ఒకరికి ఒకరం సహాయం చేసుకుంటాం. అంతే. అయితే నేను చేసింది ఏముంది లెండి. ఆ డాక్టరు లక్షణాలు చెప్తేనే జ్వరాన్ని సరిగ్గా అంచనావేసి క్యాప్సూల్స్ ఇచ్చాడు" అన్నాడు దీక్షితులు.

ఐదు నిముషాలు గడిచాక, ఇకమీరు కాసేపు పడుకోండి, నేను నా రూంలో ఉంటాను. మీకు విశ్రాంతి అవసరం.." అంటూ లేచాడు దీక్షితులు.

అతను చిరునవ్వుతో తల పంకించాడు. అంతలో ఏదో గుర్తుకు వచ్చినవానిలా "ఆ! ఇంతకీ మీ పేరు..?" అడిగాడు ఆ వ్యక్తిని.

"నా పేరు.. భీమరావు. నా కులం..." చెప్పబోయాడతను.

"మీ పేరు చాలులెండి. కులాల ప్రసక్తి మనకెందుకు అవి రాజకీయ నాయకులు, పెళ్ళి ప్రసక్తి వచ్చినప్పుడు మన పెద్దలు చూసుకోవల్సినవి. నేనిక్కడ ఉంటే మీరు విశ్రాంతి తీసుకోవడం కుదరదు. బై.. " అంటూ తన రూంవైపు కదిలేడు దీక్షితులు.

'మానవత్వం మేళవించిన మంచి మనిషి, కులాల రాజకీయాలు ఇంకా సోకని పవిత్రమూర్తి ఇతను' అనుకున్నాడు భీమరావు.

★ ★ ★

మర్నాటికి జ్వరం తగ్గి, మామూలు స్థితికి వచ్చింది భీమరావు పరిస్థితి.

"ఈరోజు మీరు పత్యం తినొచ్చు. హాస్టలు వార్డెన్‌తో మాట్లాడి, మీకు రూముకి క్యారియర్ తెప్పిస్తాను. అది కొంచెం తిని రెస్టు తీసుకోండి." అంటూ అతని రూంలోకి వచ్చి కూర్చుంటూ అన్నాడు దీక్షితులు.

అతను చూపిస్తున్న ఆదరణకి, అతను చేస్తున్న సేవకి విస్తుపోతున్నాడు భీమరావు.

"మీతో ఒక విషయం చెప్పాలి. అప్పుడు గాని నాకు 'ఫ్రీ'గా ఉండదు" అన్నాడు భీమరావు.

"ఏమిటండీ అంత సీరియస్‌గా మాట్లాడుతున్నారు?"

"ఇలా అంటున్నానని మీరేం అనుకోవద్దు. నేను చెప్పేది పైపైన మనం లేదు, కాదు అనుకున్నా లోలోన బలపడుతున్న ఓ దివ్యశక్తి గురించి.

"ఏదైనా ఆటంబాంబు గురించి చెప్పదలుచుకున్నారా? తొందరగా చెప్పెయ్యండి. సీదా సాదా మనిషిని. నాకు 'సీరియస్‌నెస్' అంటే భయం.

"అవును ఇది ఆటంబాబు లాంటిదే. మన సామాజిక వ్యవస్థని, రాజకీయాల్ని ఏలుతున్న దివ్యశక్తి... అదే మన కులాల వ్యవహారం" తన ఉద్దేశం సున్నితంగా చెప్పాలని ఆరాటపడుతూ అన్నాడు భీమరావు.

"చెప్పండి బాబూ మీరు చెప్పదలుచుకున్నదేదో, మీరు మొదటి నుంచీ, నాకేదో చెప్పాలని అనుకుంటున్నారనిపిస్తోంది. కానీ మీచే చెప్పించుకోవటం నాకు చేతకాలేదు. ఇప్పుడు చక్కగా ఆ ప్రసక్తి మీరే మళ్ళీ తీసుకువచ్చారు."

మిస్టర్ పిచ్చిపిచ్చి వేషాలు వేస్తే పళ్ళు రాలగొడతాను బికేర్‌ఫుల్

'నాకో చిన్న డౌట్ మిస్! మీరు స్టూడెంటా? డెంటిస్టా?

పి.వి.రమణకుమార్
చిలకలూరిపేట



"కొన్ని నిజాలు, ఇజాలు తెలిసీ తెలియకుండా ఉంచుకునే కన్నా మనకి మనం అవి చెప్పేసుకుంటే 'ఫ్రీ'గా ఉంటుంది.

"ఇంతకీ మీరు అగ్రకులస్తులు. నేను... అతని మాట పూర్తి చెయ్యకుండానే,

"నాకు తెలుసును" అన్నాడు దీక్షితులు.

"మీకు తెలుసా" ఇటువంటివి ఏమీ పట్టించుకోనంటూ, మీరు కూడా 'ఎంక్వయిరీ' చేసుకున్నారా?" నిర్లిప్తంగా అన్నాడు భీమరావు.

"నో!నో! నేను ఎంక్వయిరీ చెయ్యటం కాదు. మా కజిన్ ఒకడు నాకు సీనియర్ ఉన్నాడు. వాడు చెప్పాడు. నిన్న నా రూంకి వచ్చినప్పుడు అంతే!"

"కొందరు అగ్ర కులస్థులు తామేదో గొప్పవారమనుకుంటారు. అలాగే మా వాళ్ళు కూడా కొందరు "ఇన్ఫీరియారిటీ" కాంప్లెక్స్‌తో ఉంటారు. అవి నాకు నచ్చవు. అన్ని కులాలు విలువ ఒకటే. ఒకటి గొప్పది, ఒకటి అల్పమైనది అని నేను అనుకోవటం లేదు. ఒకవేళ మీకు అటువంటి 'ఇగో' ఉంటే ముందే అదేదో చూసుకోవటం మంచిదని ఈ ప్రసక్తి తీసుకువచ్చాను" అన్నాడు చిరునవ్వుతో భీమరావు.

"వ్యక్తిని వ్యక్తిగా చూసుకుంటాను నేను. అతనిలోని ఆలోచనా విధానం చూస్తాను గానీ, అతను ఏ కులస్థుడు, ఎంత ఆస్తిపరుడు అన్న వాని మీద ఆధారపడి స్నేహం చెయ్యటం నాకు ఇష్టం ఉండదు. అంతేకాదు, మీరు చెప్పినట్లుగా కొన్ని కులాలు గొప్పవని నేను అనుకోవటం లేదు. ఎవరి పని వారిది. ప్రతి వ్యక్తిలోని మంచి, చెడులే మనం చూడవల్సిన ప్రధాన అంశం."

"అబ్బ! ఏదీ చెయ్యి కలపండి. ఇన్నాళ్ళకి నాకో మంచి వ్యక్తి తారసపడ్డాడు. అయామ్ వెరీ హాపీ!" దీక్షితులు చేతిని తన అరచేతితో మృదువుగా నొక్కుతూ అన్నాడు భీమరావు.

"థాంక్ గాడ్!" అన్నాడు ఆనందాతిశయంతో దీక్షితులు.

"నో!నో! థాంక్స్ టు మై ఫీవర్!"

"ఓహో! గుడ్ జోక్!".

ఇద్దరూ పగలపడి నవ్వుకున్నారు. కల్మషం తెలియని పసిపిల్లలు చటుక్కున కలిసిపోయినట్లుగా కలిసిపోయారిద్దరూ.

★ ★ ★

'మెస్'లో భోజనం చేసి, తమ రూమ్స్‌కి నడుస్తున్నారు భీమరావు, దీక్షితులు. దారిలో దీక్షితులు కజిన్, సూర్యం వచ్చి కలిశారు.

"హలో! సూరీ! బాగున్నావా? ఏరా! అసలు మా హాస్టల్ వైపు రావటం మానేశావు?" పలకరింపుగా అడిగాడు దీక్షితులు.

"క్లాసులు మొదలయ్యేయి కదా, ఇంకా టైమెక్కడుంటుంది? చదువు, అసైన్‌మెంట్లు చేసుకోవడంతో టైమ్ సరిపోతుంది, ఆ.. సరే నీతో ఓ రెండు నిమిషాలు పర్సనల్‌గా మాట్లాడాలి" అన్నారు సూర్యం.

అది విన్న భీమరావు వెంటనే, "మీరు మాట్లాడుకుంటూ నెమ్మదిగా రండి, నేను రూముకి వెళ్ళిపోతున్నాను" అంటూ వారి సమాధానం కోసం చూడకుండా గబగబా అడుగువేసుకుంటూ వెళ్ళిపోయాడు.

"నీకు స్నేహం చెయ్యటానికి వాడే దొరికాడా? మన వాళ్ళెవరు లేరా?" శూలాల్లాంటి పలుకులు వెలువడ్డాయి, సూర్యం నోటినుంచి.

"ఏమిటి వాగుతున్నావ్?" కోపాన్ని నిగ్రహించుకుంటూ అసహనంగా అన్నాడు దీక్షితులు.

"వాడి కులమేంటో తెలుసా? వాడితో మాట్లాడేవని తెలిస్తేనే మీ అమ్మ నీచేత స్నానం చేయిస్తుంది"

"మా అమ్మ సంగతి నేను చూసుకుంటాను. ముందు ఇది చెప్పు నువ్వు. నువ్వు నాతో మాట్లాడదలుచుకున్నది ఇదేనా?"

"ఆ! కాదు కానీ, నాకో చిన్న సాయం చెయ్యాలి!"

"చెప్పు త్వరగా ఏమిటి?"

"మీ నాన్న ఊళ్ళో పంచాయతీ బోర్డు ప్రెసిడెంటుకదా! నాకు చిన్న సర్టిఫికెట్ ఇప్పించాలి, ఏమనంటే, నేను షెడ్యూల్డు కాస్ట్" అని చిన్నగా విషయం బయటపెట్టాడు సూర్యం.

"బాగుంది. నాకు 10 ఎకరాలు కొబ్బరి తోట ఉన్నా, మీ ఆదాయం సంవత్సరానికి 10 వేల రూపాయలు ఉండదని, ఇది వరకు సర్టిఫికెట్ తీసుకున్నావు. ఇప్పుడు ఇదా!"

"బోల్డు మంది. ఇటువంటి సర్టిఫికెట్స్ పెడుతు

రవి: ప్రియా సినిమాకు వెళదామా పార్క్‌కు వెళదామా?
ప్రియ: పార్క్‌కే వెళదామండీ సాయంత్రం సినిమా హాలు దగ్గర నా కోసం చంద్రం ఎదురు చూస్తుంటాడు అని నాలిక్కరుచుకుంది.

శ్రీను
ప్రొద్దుటూరు



తున్నారు. ఏ గొడవలూ రాకుండా నేను చూసుకుంటాను. ఈ సర్టిఫికెట్ ఇప్పిస్తే ఇప్పుడు స్కాలర్‌షిప్ వస్తుంది. తరవాత ఉద్యోగానికి బాధుండదు. లేకపోతే పార్వర్డ్ కాస్ట్‌ల అసలు ఉద్యోగాలు ఏవీ?"

"నిమ్నజాతుల ప్రజల్ని ఉద్ధరించాలన్న ఉద్దేశ్యంతో, వారికి కొన్ని రాయితీలు కల్పిస్తే, ఆదాయం, సమాజంలో గౌరవం, పలుకుబడి తక్కువ లేని నీకు ఆ రాయితీల్లో కూడా భాగం కావాలా? ఎప్పుడూ ఇటువంటివి ఆశించకు. అది చాలా తప్పు" అంటూ సూర్యం నుంచి వేరు పడి, తన దారిన తాను నడవసాగాడు దీక్షితులు.

"డామిట్! ఏం ఫోజురా నాయనా! చెప్తా!" అనుకున్నాడు కోపంగా సూర్యం.

★ ★ ★

'మిడ్ సెమిస్టర్ పరీక్షలు అయిపోయి శెలవులు మొదలయ్యేయి. విద్యార్థులు తమ తమ ఊళ్ళకి వెళ్ళడానికి తయారవుతున్నారు.

"ఈ సెలవుల్లో మా ఇంటికి రా భీమ్!" ఆహ్వానించాడు దీక్షితులు.

"అమ్మో సెలవుల్లో మా అమ్మతోటి, మా అయ్యతోటి గడపద్దూ, అంతగా అయితే నువ్వే మా ఇంటికి రా!" అన్నాడు భీమరావు.

"నో! ముందు ఆహ్వానం నాది. పోనీ ఒక్క రెండురోజులు మా ఇంట్లో ఉండి, మీ ఊరు వెళ్ళిపోదువు గాని ప్లీజ్!" అర్థించాడు దీక్షితులు.

"ఓ కే! బాస్ ! డన్!" అన్నాడు భీమరావు. మిత్రుడు నొచ్చుకోకూడదన్న ఉద్దేశంతో.

★ ★ ★

దుమ్ము రేపుకుంటూ వచ్చిన ఎర్రని బస్సు దీక్షితులు, భీమరావులను ఓ చెట్టువద్ద దించేసి, దుమ్ము రేపుకుంటూ వెళ్ళిపోయింది. "ఇదే మా ఊరు. పచ్చని చెట్ల జలతారు" అన్నాడు ఉళ్ళో దిగిన ఉత్సాహంతో దీక్షితులు.

"ఇది కవిత్వమా ! కాదు కాదు, ఊరుని చూసుకున్న ఆనందపు పైత్యం" జవాబుగా అన్నాడు భీమరావు. మిత్రులిద్దరూ నవ్వుకుంటూ నడిచి, ఇల్లు చేరుకున్నారు.

"పెద్ద ఇల్లు. ఇది పల్లెటూరి భూస్వాముల ఇంటికి ప్రతిబింబం" అనుకున్నాడు భీమరావు.

"రా! భీమ్! ఇదే మా కుటీరం కూర్చో!" అంటూ ముందు పెద్ద అరుగుల మీద ఉన్న కుర్చీలో కూర్చో పెట్టి లోపలికి ఉరికాడు దీక్షితులు ఆనందంగా "అమ్మా!" అంటూ.

"వచ్చావా బాబూ!" కొడుకుని చూసుకుని తెగ ఆనందపడింది అతనితల్లి అలివేలమ్మ.

"మా స్నేహితుడు వచ్చాడు, అతనికి మంచి నీళ్ళు ఇచ్చి వస్తాను" అంటూ గ్లాసు మంచి నీళ్ళు తీసుకొచ్చి భీమరావుకిచ్చి, మళ్ళీ ఇంట్లో కురికాడు దీక్షితులు.

"ఆ అబ్బాయి తాగిన గ్లాసు పక్కన ఉంచెయ్యి. నువ్వు ముట్టుకోకు. అటువంటి వాణ్ణి ఇంటికి తీసుకువచ్చి, మన కుర్చీలో కూర్చో పెడతావా! నీకు బొత్తిగా పాపం, పుణ్యం తెలియకుండా పోయింది" కాళికామూర్తిలా అరిచింది అలివేలమ్మ.

"నెమ్మదిగా మాట్లడమ్మా! అతనువింటే బాగుండదు" అన్నాడు బాధగా దీక్షితులు.

"నెమ్మదిగా చెప్తుంటేనే నువ్వు ఇలా తయారవుతున్నావు. నీ వ్యవహారమంతా సూర్యం చెప్పాడు" అన్నది అలివేలమ్మ. అప్పుడర్థమయింది దీక్షితులుకి ఇదంతా సూర్యం నిర్వాకమని.

"అక్కడ ఉంటే తల్లి ఇంకా రెచ్చిపోయి అరుస్తుందని, వేరే గదిలోకి దారితీసి, రెండు నిమిషాలు, అక్కడ వేచి ఉండి, మనస్సు కుదుట పరచుకుని, భీమరావుని చూడటానికి వచ్చాడు దీక్షితులు. అక్కడ భీమరావు లేడు. గుండె ఝల్లుమంది దీక్షితులుకి. గబగబా బస్టాండువైపు పరుగు తీశాడతను. దూరంగా బస్సు ఎక్కుతున్న భీమరావుని చూసి, ఇంక చేసేదేమీ లేదని వెనుతిరిగాడు బాధగా.

★ ★ ★

సెలవులు ముగిసి మళ్ళీ కాలేజీలో క్లాసులు మొదలయ్యేయి. మళ్ళీ హాస్టలు కళకళ్ళాడుతోంది.

"హలో దీక్షిత్!" అంటూ వచ్చాడు భీమరావు, దీక్షితులు గదిలోనికి. అంత అవమానం తనింట్లో జరిగినా ఏమీ జరగనట్టుగా తనని పలకరిస్తున్న మిత్రుడ్ని చూసి ఆశ్చర్యపోతున్నాడు దీక్షితులు. కానీ, అతని కళ్ళలోకి చూడటానికి అతని మొహం చెల్లటంలేదు. "రెండు రోజులుగా నిన్ను పలకరిస్తుంటే మొహం చాటేస్తున్నావు" అన్నాడు భీమరావు.

"సారీ భీమ్! అసలు నీకు సారీ అని కూడా చెప్పలేకపోతున్నాను" బాధగా అన్నాడు దీక్షితులు.

"నో! నో! మీ ఇంట్లో ఇలా జరగవచ్చునని నేను ముందే ఊహించాను. దాని గురించి నేనేమీ అనుకోవటంలేదు. నువ్వు కూడా అది అలా వదిలెయ్యి"

"వ్వాట్! నువ్వు ఇది ముందే ఊహించావా?! నిజం చెప్పు. నాకైతే సెలవుల్లో అంతా అదే గుర్తుకువచ్చి మూడ్ పాడైపోయింది. నిన్ను మా ఇంటికి తీసుకువెళ్ళక పోయినా బాగుండునని ఎన్నిసార్లు అనుకున్నానో" అన్నాడు దీక్షితులు.

"కులవ్యవస్థకి సంబంధించి ప్రస్తుతం మనం సంధియుగంలో ఉన్నాం. ఒకప్పుడు కులాల వ్యవస్థ బాహాటంగా ఉన్నది. కానీ ఇప్పుడు కులాలా గురించి బాహాటంగా అనుకోలేక ఆ వ్యవస్థని వదలలేక సతమత మయిపోతున్నాం. కుల వ్యవస్థ గురించి నా ఉద్దేశ్యం చెప్తే అందరూ నన్నో విలన్‌లాగా చూస్తారు పైపైకి. కానీ లోలోన మెచ్చుకుంటారు" అన్నాడు భీమరావు నవ్వుతూ.

"ఏమిటి చెప్పు నేనుపైకి కూడా మెచ్చుకుంటాను"

"ఈ కులజాడ్యం రూపుమాపాలని ఎందరు మొత్తుకుంటున్నా కులవ్యవస్థ పోయిందా? అది ఇంకా ఇంకా బలపడుతోంది. అందుచేత కులవ్యవస్థని అంగీకరించి, అందుకు లోబడి మనుషులు కలిసిమెలిసి ఉంటేనో!"

"అలా అవరనే కదా! ఇప్పుడు గొడవ. పైగా కొంత మంది ఇది వరకు అణగదొక్కబడ్డారు. అది అన్యాయం కాదా!"

"అది సరే! అందరికీ సమాన అవకాశాలు కల్పిస్తూ అన్ని కులాలూ సమానమే అన్న భావనతో జనజీవనం సాగిపోతేనో ! ఏమో ! అది ఎవరైనా హ్యూమానిటీస్ స్టూడెంట్సు అధ్యయనం చెయ్యాలి. నాలాంటి మాథమేటిక్సు స్టూడెంటు కాదు. అయితే ఎవరే కులమైనా మనుషులందరూ ఒక్కటే. అందరూ సమానమే అని నా ఉద్దేశ్యం. కులవ్యవస్థ ఉన్నా లేకున్నా మనుషులకు మానవత్వం కొరవడకూడదు" అన్నాడు దీక్షితులు. "బాగుంది బాస్! ఈ విషయం మళ్ళీ చర్చిద్దాము" అన్నాడు భీమరావు. ●

భార్యభర్తలు ఇద్దరు అప్పుడే షాపు నుంచి ఇంటికి వచ్చారు. వచ్చీరాగానే కంగారుగా ఏమండీ మళ్ళీ షాపుకు వెళ్ళి రావాలండీ?
ఏం? అక్కడ తీసుకున్న చీరలు మరిచిపోయావా అని అడిగాడు భార్యను.
చీరలు కాదండీ మన చంటాడ్ని మరిచిపోయాను.

శ్రీదేవి
వరంగల్

